నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | SANGAREDDY




సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని శనిగరం ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలోని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై ఇటుకరాళ్లతో దాడి చేసిన దృశ్యం

## గంగమ్మ తల్లికి మంత్రి పూజలు

కోహెడ సెప్టెంబర్ 23: సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. శనిగరం ప్రాజెక్టును పరిశీలించి పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గుట్ట నుంచి నీటి జాలు హాస్టల్‌లోకి వస్తున్నాయని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే నీటిని కాల్వ ద్వారా మళ్లించి మెయిన్ డ్రైనేజీలో కలపాలని అధికారులకు సూచించారు. తంగళ్లపల్లిలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులకు విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వాటిని తొలిగించేందుకు రూ. ఐదు లక్షల 60వేలు మంజూరు చేశారు. త్వరగా పనులు ప్రారంభించాలని మంత్రి సిద్దిపేట ఎస్ఈని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపూర్, శ్రీరాములపల్లి, కోహెడ బీటీ రోడ్లు, గొట్లమిట్ల నారాయణపూర్ మధ్య హైలేవల్ బ్రిడ్జి మంజూరైందన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం కోహెడ హోటల్‌లో టీ తాగుతూ కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడారు. నాయకులు మంద ధర్మయ్య, గౌరిట్యాల లక్ష్మణ్, ముంజ తిరుపతి, బందెల బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రత కల్పించడంలో పోలీసులు విఫలం



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఎస్జీఎఫ్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

- పటాన్‌చెరు డీఎస్పీ, సీఐలపై డీజీపీకి ఫిర్యాదు చేస్తా
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబర్ 23: జిల్లా స్థాయి క్రీడోత్సవాలకు భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వారం రోజుల క్రితమే క్రీడలు జరుగుతున్నాయని, జిల్లా స్థాయిలో క్రీడాకారులు వస్తున్నారని, వారికి భద్రత కల్పించాలని పటాన్‌చెరు పోలీసులకు రాతపూర్వకంగా నిర్వాహక కమిటీ దరఖాస్తు చేసుకున్నదన్నారు. కార్యక్రమం ప్రారంభసమయం వరకు పోలీసులను సంప్రదించినా భద్రత కల్పించకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు వందల మంది బాలికలు, బాలురు క్రీడోత్సవాలకు హాజరవుతుంటే వారికి భద్రత కల్పించాలని కోరినా పోలీసులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వారం రోజులపాటు జరిగే క్రీడోత్సవాల్లో ఎలాంటి ఘటనలు జరిగినా పోలీసులే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. పటాన్‌చెరు డీఎస్పీ, సీఐ నిర్లక్ష్యంపై రాష్ట డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, మండల విద్యాధికారి పీపీ రాథోడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి రూ.60కోట్లు మంజూరు

### రవాణా,బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, సెప్టెంబర్ 23: హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.60కోట్లు మంజూరు చేశామని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మద్ద-హుస్నాబాద్ బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు రూ.1.70కోట్లు, నాగారం-ఉమ్మాపూర్-మహ్మదాపూర్ రోడ్డుకు రూ.2.77 కోట్లు, తోటపల్లి నుంచి పూసర్లపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.57 కోట్లు, పందిల్ల-పరివేద రోడ్డుకు రూ.2.07 కోట్లు, పందిల్ల-అంబయ్యపల్లి, గొల్లపల్లి-బంజేరుపల్లి వరకు రూ.2.47 కోట్లు, కోహెడ మండలంలోని బస్వాపూర్-కోహెడ వయా ధర్మసాగర్‌పల్లి రోడ్డుకు రూ.2.81కోట్లు, నారాయణపూర్-శ్రీరాముపల్లి రెన్యువల్ పనులకు రూ.52.10లక్షలు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో రాములపల్లి-ఎల్లంపల్లి క్రాస్‌రోడ్డు వరకు రూ.88లక్షలు, గణపూర్ నుంచి ఆకునూరు వరకు రూ.23.07లక్షలు, అమ్మనగుర్తి నుంచి వంగర క్రాస్‌రోడ్డు వయా గుండ్లపల్లి రోడ్డుకు రూ.3.17 కోట్లు వచ్చాయన్నారు. చిగురుమామిడి మం డలం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ముదిమాణిక్యం వరకు రూ.1.22కోట్లు, గాగిరెడ్డిపల్లి-లంబాడిపల్లి వయా బరిగెలపల్లి రోడ్డుకు రూ.28లక్షలు, సుందరగిరి క్రాస్‌రోడ్డు నుంచి ఉల్లంపల్లి, మడత వరకు రూ.10లక్షలు, చిగురుమామిడి నుంచి రేకొండ వరకు రూ.1.97కోట్లు వచ్చాయన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మల్లా రం క్రాస్ నుంచి పీడబ్ల్యూ రోడ్డు వరకు రూ.86లక్షలు, హవర్‌దార్‌పల్లి నుంచి ఎర్రబెల్లి వరకు రూ.37లక్షలు, ముత్తారం నుంచి గట్లనర్సింగాపూర్ క్రాస్‌రోడ్డు వరకు రూ. 3.74 కోట్లు, కొప్పూరు నుంచి కొత్తపల్లి రోడ్డు వరకు రూ.1.17కోట్లు, ఎత్కుతుర్తి మండలంలోని దామెర నుంచి కొత్తపల్లి రోడ్డుకు రూ. 3.47కోట్లు, దామెర నుంచి జడ్పీ రోడ్డు వరకు రూ.87లక్షలు, దండెపల్లి నుంచి దేశరాజ్‌పల్లి వరకు రూ.1.02 కోట్ల వచ్చినట్లు పేర్కొన్నారు.

**బ్రిడ్జిల నిర్మాణానికి....**

కోహెడ మండలం గోట్లమిట్ట-నారాయణపూర్ మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.91.55 లక్షలు, కోహెడ-మైసంపల్లికి రూ.57లక్షలు, చిగురుమామిడి మండలం పీచుపల్లి రోడ్డులో రూ.57లక్షలు, లంబాడిపల్లి-పీచుపల్లి మధ్య రూ.77లక్షలు, సైదాపూర్ మండలం పెర్కపల్లి-దుద్దెనపల్లి మధ్య రూ.3.47 కోట్లు, పెర్కపల్లి-సైదాపూర్ మధ్య రూ.3.47 కోట్లు, ఆకునూరు-గణపూర్ మధ్య రూ.57 లక్షలు. భీమదేవరపల్లి మండలం ఎర్రగడ్డ-వంగర గ్రామం వద్ద రూ.87 లక్షలు, ఎల్కతుర్తి మండలం జడ్పీ రోడ్డునుంచి బావుపేట మధ్య కాజ్‌వేకు రూ.32లక్షలు, జడ్పీ రోడ్డు నుంచి బావుపేట వైకుంఠధామం మధ్య కల్వర్టు నిర్మాణానికి రూ.52లక్షలు మంజూరైనట్లు మంత్రి పొన్నం వివరించారు.

# కాంగ్రెస్ గూండాగిరి

## బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లపై కాంగ్రెస్ నాయకుల దాడులు

- నర్సాపూర్ ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగితే స్పందించని మెదక్ జిల్లా పోలీస్ యంత్రాంగం
- సీఎం రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టే మాటలతో రెచ్చిపోతున్న కాంగ్రెస్ అల్లరి మూకలు
- ప్రశాంతంగా ఉన్న జిల్లాలో అల్లర్లు సృష్టిస్తున్న కాంగ్రెస్
- కాంగ్రెస్ నేతల తీరుపై భగ్గుమంటున్న ప్రజలు



ఇంట్లో పడిన ఇటుక రాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



గోమారంలోని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంట్లో పడిన ఇటుక రాళ్లు

సిద్దిపేట, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ గూండాల ఆగడాలు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయి. అరికట్టాల్సిన పోలీసులు చేతులెత్తేశారు. మొన్న సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపైన..నిన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులపై దాడులు, వరుసగా ప్రతిపక్ష నేతలు, ఇండ్ల మీద దాడులు చేస్తూ కాంగ్రెస్ నాయకులు రాక్షసానందం పొందుతున్నారు. జిల్లాలో జరిగిన దాడులన్నీ అర్ధరాత్రులు..ఈ దాడుల వెనుక అంతర్యమేమిటి..? అన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతున్నది. ఒక మహిళా ఎమ్మెల్యే ఇంటిపై అర్ధరాత్రి కాంగ్రెస్ గూండాలు దాడులు చేస్తే వారిని అరెస్ట్ చేయరు, కేసులు నమోదు చేయరు. విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి జరిగినా ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసులు కేసులు నమోదు చేయరు. ఇదెక్కడి పాలన..? అంటూ బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ వర్గాలకు చెందిన నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, జిల్లా పోలీసులను ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు కాంగ్రెస్ నేతల అడుగులకు మడుగులు వత్తుతున్నారు. కాంగ్రెస్ గూండాల ఆగడాలను అరికట్టడంలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. దాడి చేసిన వారిని గుర్తించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. కాంగ్రెస్ పెద్దల కనుసన్నల్లో పోలీస్ అధికారులు పని చేస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ పదేండ్ల హయాంలో ఇలాంటి దాడులు ఎప్పుడూ జరుగలేదు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ నాయకులకు హాని తలపెట్టలేదు. కాంగ్రెస్ హయాంలో రోజురోజుకూ ఆ పార్టీ నేతల అరాచకాలు ఎక్కువ అవుతున్నాయి. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కత్తితో పొడిచిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నేతలపై దాడులు, వారిపై పోలీస్ కేసులు పెట్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేలా అరాచకాలు సృష్టిస్తూ జిల్లాను కాంగ్రెస్ గూండాల రాజ్యంగా మారుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టే మాటలతో జిల్లాల్లో క్యాడర్ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని విభాగాలను నిర్వీర్యం చేశారు.

### దాడుల వెనుక కాంగ్రెస్ ముఖ్యనేతల హస్తం

మొన్న సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పైన, నిన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై చేసిన అర్ధరాత్రుల దాడుల వెనుక కాంగ్రెస్‌లోని పెద్దల హస్తం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాడులన్నీ అర్ధరాత్రి పూటనే ఎంచుకుంటున్నారు. దాడులు చేస్తున్న సమయంలో పోలీసులను అటు వైపు వెళ్లవద్దు అని ముందే చెబుతున్నారు. కాంగ్రెస్ పెద్ద నేతల ఆదేశాలతో పోలీసులు చూస్తూ ఊరుకుండిపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాను గూండాల రాజ్యంగా తీర్చిదిద్దుతున్నారు. అభివృద్ధి చేయడం చేత కాదు కానీ కాంగ్రెస్ నాయకులు జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని పూర్తిగా చెడగొడుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా ఎమ్మెల్యేల ఇండ్లపై దాడులు జరిగిన సందర్భాలు లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే సీఎం రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలతో జిల్లాలో కాంగ్రెస్ నాయకులు అలజడులు సృష్టిస్తున్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నా రాజకీయపరంగా వారి పార్టీలకు అనుగుణంగా నడుచుకున్నారు. వారివారి పార్టీ సిద్ధాంతాలను చెప్పుకున్నారు. అంతేగాని ఇలాంటి వాటిని ఏపార్టీ వారు ప్రోత్సహించలేదు. ఇలాంటి దాడుల సంస్కృతి ఎప్పుడూ లేదు.

### పోలీసులు ఉన్నట్టా...?లేనట్టా..?

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై రాత్రి ఘటన జరిగితే కనీసం పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడలేదు.మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్‌లో జిల్లా ఎస్పీ, ఐజీలతో మాట్లాడే వరకు పోలీసుల్లో కనీసం చలనం రాలేదు. అసలు పోలీసులు జిల్లాలో పని చేస్తున్నారా..? అన్న సందేహం వ్యక్తమవుతున్నది. ఒక మహిళా ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగితే పోలీసులు కనీసం స్పందించకపోవడం పై బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ఇంటిలో ఎమ్మెల్యే లేని సమయంలోనే దాడి చేయడం, ఇంటి ముందు పటాకులు కాల్చడం, ఇంట్లో ఉన్న వారిపై దాడి చేయడం కాంగ్రెస్ అల్లరి మూకలకే చెందింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు దాడులు చేసినట్లు వీడియోల్లో స్పష్టంగా ఉంది. అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి జరిగింది. ఇంత స్పష్టంగా ఉన్నా జిల్లా పోలీస్ యంత్రాంగం పట్టించుకోకపోవడం, పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఒక ఎమ్మెల్యే ఇంటిపైనే దాడి జరిగితే స్పందించని పోలీసులు ఇక సామాన్యుడికి ఏం న్యాయం చేస్తారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలు జిల్లాలో ప్రభుత్వ పాలన నడుస్తుందా.? లేక రౌడీలా పాలన నడుస్తుందా..? ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాలపై ఏదో రకంగా దాడులు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నాయకులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని లా అండ్ ఆర్డర్ సమస్యను సృష్టిస్తున్నారు.



సిద్దిపేట కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ రైతులు

## రుణమాఫీ అయ్యేదెప్పుడు?

### సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 23: పంట రుణమాఫీ చేయాలంటూ సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన 80 మంది రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు లక్షల పంట రుణ మాఫీ చేస్తామని చెప్పి లక్షలోపు ఉన్న రైతులకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్న రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. అనంతరం సిద్దిపేట కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం డీఆర్డీవో జయదేవ్ ఆర్యకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ మండల బీఆర్‌ఎస్ నాయకులు ఎర్ర యాదయ్య, కిషన్‌రెడ్డి, బండి శ్రీకాంత్, హర్షవర్ధన్, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది దుర్మార్గ ప్రభుత్వం

### దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, సెప్టెంబర్ 23: అత్యంత దుర్మార్గ ప్రభుత్వమేదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వమేనని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఒక్క అభివృద్ధి పనులు చేపట్టకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమానికి కొబ్బరికాయ కొట్టిన దాఖలాలు లేవని మండిపడ్డారు. కాంగ్రెస్ కేవలం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కక్షపూరితంగా రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్‌ఎస్ సర్కారులో దుబ్బాక మున్సిపల్‌కు మంజూరైన టీయూఎఫ్ఐడీసీ రూ.10 కోట్లను ప్రభుత్వం వెనక్కితీసుకుందన్నారు. ప్రభుత్వం, మంత్రులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు నిధులు కేటాయించకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చినా లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సర్కారు అడ్డుపడుతుందని మండిపడ్డారు. రైతులు, పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్‌కు త్వరలోనే గుణపాఠం చెబుతామన్నారు.

## దాడి ఘటనలో నలుగురిపై కేసు

శివ్వంపేట, సెప్టెంబర్ 23: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడికి పాల్పడిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంట్లో ఉన్న పద్దిముక్కల మణిదీప్‌గౌడ్ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేశారన్నారు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ప్రజావాణి అర్జీలు త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 23: అర్జీదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సిద్దిపేట రెవెన్యూ అధికారి నాగరాజమ్మ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలను నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జీదారులు కార్యాలయానికి వస్తారని, వారందరికీ న్యాయం చేయాలని సూచించారు. డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు, రైతులు

## రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- సాగుభూమి మొత్తానికి రైతు భరోసా ఇవ్వాలి
- సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బీకేఎస్ నాయకులు, రైతుల ధర్నా

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో చెప్పినట్లుగానే రైతులందరికీ పంట రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ పంటరుణమాఫీ కాని రైతుల ఖాతాల్లో నిబంధనలు లేకుండా రూ.రెండు లక్షలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ ధ్రువీకరణ పూర్తైనా పంట రుణమాఫీ డబ్బులు వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వ్యవసాయశాఖ మంత్రి సూచనల మేరకు నగలు తాకట్టు పెట్టి మరీ కొందరు రైతులు రూ.2 లక్షలపై ఉన్న డబ్బులు కట్టారని, వారందరికీ పంట రుణమాఫీ అమలుచేయాలన్నారు. రైతులకు విద్య, వైద్యం, వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగాయని, వీటికి సమానంగా పంట ఉత్పత్తులు పెరగకపోవడం, వర్షాలకు పంట నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని కటాఫ్ డేట్ లేకుండా రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వానకాలానికి సంబంధించిన రైతు భరోసాను రైతు సాగు చేస్తున్న భూమి మొత్తానికి ఇవ్వాల్సిందేనన్నారు. ట్రిబుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలని లేదా సగం భూమి సగం డబ్బులు ఇచ్చి న్యాయం చేయాలన్నారు. ధర్నాలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జోగయ్య, రామకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మయ్య, రాములు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాల కూల్చివేత

### అమీన్‌పూర్‌లో హైడ్రా తరహాలో నేలమట్టం



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

ఆమీన్‌పూర్, సెప్టెంబర్ 23: హైడ్రా తరహాలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని టైలర్ వెనుక భాగంలో వైకుంఠధామం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో (సర్వే నంబర్ 993లో) అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను మున్సిపల్ టీపీవో పవన్,ఆర్ఐ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఇకపై ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని, వెంటనే అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. ఒకవైపు హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలు కొనసాగుతుండగానే కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టడం సరైన చర్య కాదని, అటువంటి ఆలోచనలు మానుకోవాలని సూచించారు. ఈ కూల్చివేతలో రెవెన్యూ, మునిసపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నోటీసుల అనంతరమే కూల్చివేతలు

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ పరిధిలో హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేసిన భవనాలకు ముందస్తుగానే నోటీసులు ఇచ్చినట్లు అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో కబ్జాదారులు అక్రమంగా నిర్మిస్తుంటే రెవెన్యూ నిబంధనల ప్రకారమే నోటీసులు అందజేస్తూ వారికి తెలియజేశామన్నారు. అయినప్పటికీ సదరు వ్యక్తు లు అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. చివరగా కూల్చివేతలకు ముందుగానే వారికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఎక్కడ కూడా నిబంధనలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టలేదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ

### అర్ధాంతరంగా ఆగిన

## బీటీ రోడ్డు నిర్మాణ పనులు



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలో అర్ధంతరంగా వదిలివేసిన రోడ్డు నిర్మాణ పనులు

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 23: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్ నుంచి బెక్కల్ శివాలితండా మీదుగా రామవరం వెళ్లేందుకు వీలుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీటీ రోడ్డు మంజూరు చేసింది. గతేడాది రూ.4కోట్లు మంజూరు చేసి బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించింది. రోడ్డు నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సుమారు 5 కిలోమీటర్ల దూరంలో కంకర పోసి మధ్యలోనే నిర్మాణ పనులు నిలిపివేశాడు. రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే అర్ధంతరంగా నిలిచిపోవడంతో కొండాపూర్, రామవరం గ్రామాలకు వెళ్లేందుకు కంకర రోడ్డుతో శివాలితండా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయడంలో ఆంతర్యం ఏమిటని తండావాసులు ప్రశ్నిస్తున్నారు.